క్లుప్తంగా

నేడు జగద్గిరిగుట్టలో అన్నదానం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ గణపతి విగ్రహం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి బ్యూటీషియన్, కుట్టు శిక్షణ

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్ పరపతి సంఘం ఆధ్వర్యంలో చిల్కూర్ దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం బ్యూటీషియన్, కుట్టు శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు. శిక్షణ పొందడానికి 30 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని నిర్వాహకులు తెలిపారు.

నిర్మాణరంగ అభివృద్ధిలో న్యాక్ కీలకం

మాదాపూర్: శిక్షణతో బాటు ఉపాధి కల్పించడం తమ సంస్థ ప్రత్యేకత అని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి అన్నారు. మాదాపూర్‌లోని న్యాక్‌లో సోమవారం సంస్థ రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ 25 సంవత్సరాలలో 4.75 లక్షల మంది యువతకు నిర్మాణ రంగంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి ఉపాధి కల్పించినట్టు తెలిపారు. సంస్థ ఏర్పడి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. న్యాక్‌ను తొలి నిర్మాణరంగ విశ్వవిద్యాలయంగా మార్చాలనే ప్రతిపాదనలు ముఖ్యమంత్రి వద్ద ఉన్నాయని, త్వరలోనే యూనివర్శిటీగా అవతరించే అవకాశం అందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐఐ చైర్మన్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణరంగం అభివృద్ధిలో న్యాక్ తనవంతు పాత్రపోషిస్తుందన్నారు. ఉత్తమ సేవలందించిన 20 మంది ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు.

ఈపీటీఆర్ఐ - ఇక్ఫాయ్ ఒప్పందం

రాయదుర్గం: పరిశోధన రంగాలలో మరింతగా పరస్పరం సహకరించుకొని సంయుక్తంగా పని చేయాలని గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ (పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ),ఇక్ఫాయ్ యూనివర్శిటీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ది ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ కౌన్సిల్)తో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంపై సోమవారం ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్, ఇక్ఫాయ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ ఎస్ గణేష్ సంతకాలు చేశారు.ఈ సందర్భంగా వాణిప్రసాద్ మాట్లాడుతూ వాతావరణ మార్పు, నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ ప్రభావ అంచనా, సహజ వనరుల స్థిరమైన ఉపయోగం కోసం వ్యర్థాల నిర్వహణ మొదలైన రంగాలలో కలసి పనిచేయాలని నిర్ణయించామన్నారు. ఇక్ఫాయ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌ఎస్ గణేష్ మాట్లాడుతూ పర్యావరణ చట్టం, న్యాయంలో ఈపీటీఆర్ఐ ఐసీఎఫ్ఏఐ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ మేనేజర్ డా.భీమ్‌రెడ్డి, ఇక్ఫాయ్ అధికారులు లోకేశ్వరి, చంద్రకళ,ఈపీటీఆర్ఐ డబ్ల్యూ ఆర్‌సీ మెడ్ మధు చంద్రిక, ఎయిర్ ఎక్స్‌పర్ట్ రైసుద్దీన్ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుర అప్పగింత

జీడిమెట్ల: ఇంటి నుంచి తప్పిపోయి వచ్చిన ఇద్దరు బాలురు (అన్నదమ్ములు) జీడిమెట్ల పోలీసుల వద్ద ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఆషిక్(8), ఆసీఫ్(5) అనే ఇద్దరు బాలురు (అన్నదమ్ములు) షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులో ఏడుస్తూ ఉండగా స్థానికులు జీడిమెట్ల పెట్రోలింగ్ పోలీసులకు అప్పగించారు. స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు బాలుర వివరాలు అడగగా వారి ఇద్దరి పేర్లతో పాటు తండ్రి పేరు అజీమ్, తల్లిపేరు మన్సూర్ కాతూన్ అని.. ఉండేది సూరారం అని తెలిపారు. పోలీసులు ఈ విషయాన్ని సోమవారం సాయంత్రం వరకు వాట్రాప్ గ్రూపుల్లో పార్వర్డ్ చేశారు. సోమవారం రాత్రి 9గంటలకు రోడామేస్త్రీ నగర్‌కు చెందిన బాలుర తండ్రికి విషయం తెలియడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ పవన్ ఆ బాలురను తండ్రి అజీమ్‌కు అప్పగించారు.


బాలురను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

శ్రీశైలంలో ఎమ్మెల్సీ రాజు పూజలు

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఎమ్మెల్సీకి స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అదే విధంగా మహానందిశ్వర ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసోజు శ్రవణ్, బొరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, గాజులరామారం డివిజన్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌రామిరెడ్డి తదితరులు ఉన్నారు.





పర్యవేక్షణ లోపం.. నిర్వహణ శూన్యం


ధ్వంసమైన ఫుట్‌పాత్ టైల్స్

- ఫుట్‌పాత్ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం
- నిర్మించిన ఫుట్‌పాత్‌లు నాణ్యత లేక ధ్వంసం
- అధికారులు, కాంట్రాక్టర్‌పై పాదచారుల ఆగ్రహం


చింతల్ - షాపూర్‌నగర్ రోడ్డులోని హెచ్ఎంటీ పరిశ్రమ సమీపంలో అసంపూర్తిగా నిర్మాణం



చింతల్ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై పార్కింగ్


షా థియేటర్ వద్ద కానరాని ఫుట్ పాత్ నిర్మాణం

రంగారెడ్డినగర్: పాదచారులకు సురక్షితమైన నడకదారి ఏర్పాటు చేసేందుకు సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం (సీఆర్ఎంపీ) కార్యక్రమంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కోట్లాది నిధులతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు నిర్వహణ కొరవడింది. సదరు పనుల దక్కించుకున్న కాంట్రాక్టర్ ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో నాణ్యాత ప్రమాణాలు పాటించకపోవడంతో కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకోవగా మరికొన్ని చోట్ల అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్ట లేదు. ఇవేమి పట్టించుకోని అధికారులు సదరు కాంట్రాక్టర్లకు బిల్లులు సైతం విడుదల చేయడం విమర్శలకు తావిస్తోంది.

రూ.1.5 కోట్లతో 20 కిలోమీటర్ల మేర..

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఐడీపీఎల్ నుంచి సూరారం కట్టమైసమ్మ ఆలయం వరకు నర్సాపూర్ రాష్ట్ర రహదారికి ఇరువైపులా రూ.1.5 కోట్ల సీఆర్ఎంపీ నిధులతో 20కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులకు సర్కిల్ అధికారులు మూడేళ్ల కిత్రం టెండర్లు పిలిచి కాంట్రాక్ట్‌కు అప్పగించారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చాడు. ఇసుకకు బదులుగా రాతిపొడి వాడటంతో పాటు సరైన పాళ్లల్లో కాంక్రీట్, సిమెంట్‌లను వాడకపోవడంతో పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై వేసిన బిళ్లలు కొద్ది రోజులకే ధ్వంసమయ్యాయి.

పలు చోట్ల పూర్తి కాని ఫుట్‌పాత్..

హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం మీదుగా చింతల్ నుంచి షాపూర్‌నగర్ వరకు ఉన్న రహదారిలో పలు చోట్ల కాంట్రాక్టర్ ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టకుండా వదిలేశాడు. అదే విధంగా చింతల్ షా థియేటర్ ప్రాంతం, ఐడీపీఎల్ పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో అసలు ఫుట్‌పాత్ నిర్మించిన ఆనవాళ్లే కనిపించడం లేదు. ఇటుగా ప్రతినిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా అవేమీ పట్టించుకోకుండా సదరు గుత్తేదారుడికి బిల్లులు చెల్లించారు. దీంతో ఫుట్‌పాత్ పనుల వ్యవహారంపై పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్యూరింగ్ సరిగా చేయకనే..

ఫుట్‌పాత్ నిర్మాణ సమయంలో కింది కాంక్రీట్ బేస్‌మెంట్ వేసిన తదనంతరం దాని పటిష్టతకు 11 రోజుల పాటు క్యూరింగ్ చేసి అనంతరం నడకదారికి అనువుగా టైల్స్‌ను అమర్చాల్సి ఉంటుంది. కాని సదరు కాంట్రాక్టర్ ఇవేమి పట్టించుకోకుండా త్వరితగతిన పనులు పూర్తి చేశాడు. దీంతో చింతల్ నుంచి ఐడీపీఎల్ వరకు పలు చోట్ల ఫుట్‌పాత్‌లు ధ్వంసం కావడంతో పాటు బిళ్లను ఊడిపోయాయి.

పలు చోట్ల ఫుట్‌పాత్‌లపై అక్రమణలు..

ఒక వైపు నాసిరకం ఫుట్‌పాత్‌లపై నడక సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న పాదచారులకు ఫుట్‌పాత్ ఆక్రమణలతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిరు వ్యాపారులు, పలు దుకాణ సముదాయాల నిర్వాహకులు ఫుట్‌పాత్ ప్రాంతాలను పార్కింగ్‌లకు వినియోగించడం గమనార్హం. ఫుట్‌పాత్‌ల నిర్వహణపై సర్కిల్ అధికారులు దృష్టి సారించి ధ్వంసమైన ఫుట్‌పాత్‌లను పునరుద్ధరించాలని పాదచారులు కోరుతున్నారు.

సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేదు

- ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత లేకుండా మంత్రి కేటీఆర్ సహకరిస్తున్నారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్‌బస్తీలో రూ.10 లక్షల నిధులతో చేపట్టనునన్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి విషయంలో ఎన్ని నిధులు వెచ్చించడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

◆ కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్ల పరిధిలో శ్రీరామ్‌నగర్ కాలనీ, మాణిక్యనగర్, సూర్యనగర్, శ్రీకృష్ణనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీల్లో రూ. 2.61 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ లైన్, కమిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కె.ఎం.గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

◆ శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన దళిత సంఘాల ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు జానయ్య ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

అనుమతులు లేని షెడ్డు నిర్మాణం కూల్చివేత

జీడిమెట్ల: అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ షెడ్డును సోమవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో సంతోష్ అనే వ్యక్తి 400గజాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ షెడ్డును నిర్మిస్తున్నాడు. షెడ్డు నిర్మాణం ప్రారంభమై దాదాపు 5నెలలు అధికారులు తెలిసి తెలియనట్లు మౌనంగా ఉండి నిర్మాణం చివరి దశకు చేరుకోగానే కూల్చి వేయడం పట్ల స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పాక్షికంగా కూల్చివేసిన అధికారులు..
అనుమానం వ్యక్తం చేస్తున్న స్థానికులు..

సదరు షెడ్డును అధికారులు తూతూ మంత్రంగా కొంత మేరకు కూల్చి వేయడం పట్ల స్థానికులు భిన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, షెడ్డు యజమానికి అమ్యామ్యాల్లో బేరం కుదరకపోవడం వల్లనే అధికారులు కూల్చి వేతలకు పూనుకున్నట్లు తెలుస్తుంది. అసలు నివాసాల మధ్య షెడ్ల నిర్మాణాలు చేపట్టడానికి అనుమతలు సైతం లేవు. 5నెలలుగా నిర్మాణం సాగుతున్నప్పటికి అధికారులు ఇన్ని రోజులు మిన్నకుండిపోయారు. ఇప్పటి వరకు అధికారుల అండదండలతోనే షెడ్డు నిర్మాణం సాగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ షెడ్డు నిర్మాణం తిరిగి మొదలైతే అధికారుల చేతివాటం పక్కా ఉన్నట్లేనని స్థానికులు అంటున్నారు.

డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి

కుత్బుల్లాపూర్: డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నానని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలో సోమవారం రూ.122.3 లక్షల అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపనలు చేశారు. శ్రీకృష్ణనగర్‌లో రూ.40 లక్షలతో, బ్యాంక్ కాలనీలో రూ.33.7 లక్షలతో, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో రూ.15.30 లక్షలతో, ఏరోనాటికల్ కాలనీలో రూ.15 లక్షలతో, జీడిమెట్ల గ్రామంలో రూ.18.30 లక్షల నిధులతో నూతనంగా వేయనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణానగర్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, ఏరోనాటికల్ కాలనీ అధ్యక్షుడు కనకయ్య, బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, హన్మంతు, బీరప్ప, బాలప్ప, చెరుకుపల్లి రాజారెడ్డి, రాజు, సతీష్,ఝాన్సీ, దుర్గయ్య, ప్రతాప్, చక్రి, శ్రీదేవి, నందు గౌడ్, శ్రీను ముదిరాజ్ తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తునన కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్‌లో మైనంపల్లి ఎఫెక్ట్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీలో 'మైనంపల్లి' ఎఫెక్ట్ చోటు చేసుకుంటుంది. నియోజకవర్గంలో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పాటు చేసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఈనెల 27వ తేదీన ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో స్థానికంగా ఉండే దూలపల్లి నివాసానికి కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు ఆయనతో మంతనాలు జరిపారు.

మైనంపల్లి వెంటే మేము..

◆ దూలపల్లి సింగిల్ విండో చైర్మన్ గరిసే నరేందర్ రాజు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ దేవేందర్, కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి అదే విధంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా కొనసాగిన బీఆర్ఎస్ సీనియర్ నేత బొంగునూరి ప్రభాకర్ రెడ్డి సైతం పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారు. ఇదే విషయంపై పైన పేర్కొన్న నాయకులను 'సాక్షి'పలకరిస్తే తాము ఎమ్మెల్యే మైనంపల్లి వెంటే ఉంటామని స్పష్టం చేశారు.

◆ **కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో మంతనాలు...**

మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లకు చెందిన పలువురు కార్పొరేటర్లతో పాటు కొంపల్లి మున్సిపాలిటీలో అధికార పార్టీలో కొనసాగుతున్న మరి కొంతమంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే వీరికి మైనంపల్లి నేరుగా ఫోన్లు చేసి ఆహ్వానం తెలిపినట్లు సమాచారం. ఏది ఏమైనా మైనంపల్లి హన్మంతరావు ఎఫెక్ట్ కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ పార్టీలో కలకలం రేపుతుంది.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య


పోచమ్మ (ఫైల్)

జగద్గిరిగుట్ట: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం గాజులరామారంకు చెందిన పోచమ్మ (46), యాదగిరి బార్య భర్తలు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఇంట్లో గొడవలు కూడా జరుగుతున్నాయి. వీరితో పాటు ఇంట్లో కుమారుడు కోడలు కూడా ఉంటున్నారు. కాగా సోమవారం ఎవరి పనులకు వారు వెళ్లిన తర్వాత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంత స్వామి

దుండిగల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం ఇప్పించి అండగా నిలిచారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట ప్రాంతానికి చెందిన దూసకంటి కవిత ఇటీవల ఓ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, అనంత స్వామిలు ప్రమాదానికి కారణమైన స్కూల్ యాజమాన్యంతో చర్చించారు. రూ.1.5 లక్షల చెక్కును సోమవారం కృష్ణ, అనంతస్వామిలు కవిత భర్త దూసకంటి రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో జీతయ్య, రంగయ్య, రమేశ్, లక్ష్మణ్, నరసింహ, శ్రీహరి, అశోక్, శ్రీశైలం, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దుండిగల్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.పోచంపల్లి కుడికుంట చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలుతూ కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని మృతదేహన్ని వెలికి తీయించారు. మృతుడి ఒంటిపై అండర్ వేర్ మాత్రమే ఉండడంతో చెరువులో ఈత కొట్టేందుకు దిగి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. చెరువు ఒడ్డున బ్లాక్ కలర్ ప్యాంట్, బ్లూ కలర్ టీషర్ట్ ఉన్నాయని అన్నారు. మృతుడి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేచర్ ఇన్‌స్పైర్డ్ కెమిస్ట్రీ అండ్ ఇంజనీరింగ్‌పై సెమినార్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో కెమికల్ సైన్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో సోమవారం 'నేచర్ ఇన్‌స్పైర్డ్ కెమిస్ట్రీ అండ్ ఇంజనీరింగ్' రెండు రోజుల సెమినార్ సోమవారం ప్రారంభమైంది. యూనివర్సిటీ క్యాంపస్‌లో సెమినార్‌ని సెంటర్ ఫర్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో, కెమికల్ సైన్స్ డిపార్టుమెంట్ ప్రధాన ఆచార్యులు డా. ఏ జయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా వైస్‌చాన్సలర్ ప్రొ. కట్టా నరసింహారెడ్డి, విశిష్ట అతిథిగా డా. శ్రీవారి చంద్రశేఖర్, ప్రొ. గోవర్ధన్, ప్రొ. జీవీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

◆ ఈసందర్భంగా వీసీ నరసింహారెడ్డి మాట్లాడుతూ జేఎన్‌టీయూలో బహుళ క్రమశిక్షణా విభాగాలను ఏర్పాటు చేయాలన్నది తన సంకల్పమన్నారు. యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌తో పాటు అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉంటే మంచిదన్నారు. అందుకు తగిన విధంగా అధునాతన, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తూ భవన నిర్మాణం చేస్తున్నామన్నారు. కొన్ని దేశాల్లో ప్రజలు ప్రోటీన్స్ అనే పౌష్టికాహారం లేక అక్కడ చిన్నారులు, పెద్దలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించాలన్నారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి మదీనాగూడ త్రివేణి స్కూల్‌లో... సంగారెడ్డి జిల్లాకు సంబంధించి జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి... మెదక్ జిల్లాకు సంబంధించి పటాన్‌చెరు మండలం రుద్రారం ఎంఎస్ఎన్ లాబొరేటరీలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.


వైష్ణాయ్ ఎంక్లేవ్‌లో ఏర్పాటు చేసిన గణపతి పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఓం గం గణపతయే నమో నమః

కుత్బుల్లాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడు విశేష పూజలందుకున్నాడు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండపాల్లో గణనాథులను నిమజ్జనాలకు తరలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదానాలు నిర్వహించి లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల మధ్య నిమజ్జనానికి తీసుకువెళ్లారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పూజలు నిర్వహించారు.


శివ హిల్స్‌లో పూజల్లో పాల్గొన్న శ్రమశక్తి గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్


గణేశ్ పూజల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి


మైసమ్మనగర్‌లో సృజన యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ గణనాథుడికి పూజలు


షాపూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


కొంపల్లిలో జరిగిన పూజల్లో పాల్గొన్న జిమ్మి దేవేందర్


గణేశ్ లడ్డూ వేలంపాటలో రూ.88 వేలకు లడ్డూను సొంతం చేసుకున్న వల్లకాటి గణేష్


గాజులరామారంలోని బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్ గణేశ్ మండపంలో భక్తులు